

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రేమ?

**పెళ్ళవగానే** పొన్నూరు నించి డిబ్రూఘడ్‌కి వచ్చి పడ్డ సజనికి కొత్తల్లో పిచ్చెక్కిపోయింది. అప్పటికీ విజయవాడ విశాలాంధ్రలో బోలెడు పుస్తకాలు కొని తెచ్చుకుంది. స్వాతి వీక్లీ, మంత్లీ, ఆంధ్రభూమి వీక్లీ, మంత్లీ, చతుర, విపుల అన్ని మేగజైన్స్‌కి సంవత్సర చందా కట్టింది. భాస్కర్ డిష్ టి.వి పెట్టించి, తెలుగు ఛానల్స్ పేకేజ్ తీసుకున్నాడు. ఐనా ఉదయం తొమ్మిదినుంచి సాయంత్రం ఆరుదాకా వంటరితనంతో విలవిల్లాడిపోయింది. ఫ్రెండ్సంతా పెళ్ళవగానే అయితే హైదరాబాద్, లేకపోతే అమెరికా వెళ్ళారు. తనే త్రిశంకు స్వర్గంలా ఈ అస్సాం వచ్చి పడిందని తెగ బాధపడిపోయింది.

భాస్కర్ ఆ ప్రభుత్వ రంగసంస్థలో ఆఫీసర్‌గా డైరెక్ట్ రిక్రూటీ కాబట్టి పెద్ద క్వార్టర్ ఇచ్చారు. మూడు బెడ్‌రూమ్స్, హాల్, కిచెన్. ఇంటి ముందు చిన్నతోట. 'ఇదే ఇల్లు హైదరాబాద్‌లోనో, బెంగుళూర్‌లోనో ఉంటే ఎంత బావుండేది. చుట్టుపక్కల తెలుగువాళ్ళు ఉండేవాళ్ళు, పొన్నూరు వెళ్ళిరావడానికి దగ్గరగా ఉండేది' అని వాపోయింది. హిందీ రాకపోవడంతో ఎవరూ ఫ్రెండ్స్ కాలేరు.

మూడు నెలలు గడిచేకొద్దీ నెమ్మదిగా ఆ వాతావరణానికి, వంటరితనానికి అలవాటు పడింది. తామిద్దరే తప్ప బంధుమిత్రులు ఎవరూ దగ్గరలో లేకపోవడంతో భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యం పెరిగి సంసారం చక్కగా సాగుతోంది.

విజయవాడలో కొన్న పుస్తకాలు చదవడం పూర్తయి, అవి ఎక్కడబడితే అక్కడ కనిపిస్తున్నాయని ఆ మధ్యాహ్నం సజని వాటన్నిటినీ తాడుతో కట్టి, ఒక ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి, పెద్ద స్టూల్ ఎక్కి అటకమీద పెట్టింది. మూట లోపలకి పోకుండా, బయటకే కనిపిస్తూండడంతో వెనక ఏదో అడ్డొస్తోందని మునివేళ్ళమీద నిలబడి, చేతులతో తడిమింది. ఏదో పుస్తకం. దాన్ని పక్కకి లాగి, తన పుస్తకాల మూటని వెనక్కి నెట్టి ఆ పుస్తకం తీసుకుని దిగి దానివంక ఆసక్తిగా చూసింది. అదో డైరీ. లోపలి పేజీలో గుండ్రటి చేతిరాతతో తెలుగులో రాసుంది పినాకిని అని.

అస్సాంలోని డిబ్రూఘడ్‌లో ఓ గవర్నమెంట్ క్వార్టర్‌లో తెలుగమ్మాయికి మరో తెలుగమ్మాయ్ రాసిన డైరీ దొరకడంతో సజని విభ్రాంతి చెందింది.

బాగా దుమ్ముపట్టి వున్న దాన్ని బయటకి తీసుకెళ్ళి శుభ్రంగా దులిపి చేతులు కడుక్కుని బెడ్ రూంలోకి వచ్చి మంచం మీద వాలి దాన్ని తెరిచింది.

నిజానికి సజని ఇతరుల డైరీ చదివేంత కుసంస్కారి కాకపోయినా ఆసక్తి ఆమె సంస్కారాన్ని కప్పిపుచ్చింది.

2009 డైరీ అది. డేట్స్ వారీకాకుండా ఇష్టమొచ్చినట్లుగా రాసుకుపోయింది పినాకిని. చేతిరాత అందంగా, ముత్యాలకోవలా ఉంది.

'డియర్ సుమా! వద్దని ఏడ్చి మొత్తుకున్నా పెద్దవాళ్ళు పెళ్ళి చేసి ఈ ద్రిబూకి పంపించారు. నువ్వులేవు. నవ్వడం మర్చిపోయాను. నానాజీ నాకు ఇంటిమీద దిగులు అనుకుంటున్నాడు అనుకోనివ్వు. వాడి స్పర్శ కంపరంగా ఉంటోంది. పూరెక్కలతో స్పృశించినట్లుగా ఉండే నీ స్పర్శ కోసం నా దేహం తపించిపోతోంది.'

ఒక్క క్షణం ఆగింది సజని. ఈ పినాకిని ఏమిటి తేడాగా ఉంది. తోటి ఆడదాని స్పర్శకోసం తపించడం ఏమిటి? ఆ డైరీ ఆమెకి ఇంకాస్త ఆసక్తిగా అనిపించింది.

'ఈరోజు నానాజీ నన్ను "రోజూ కేంటీన్‌లో తినలేను పొద్దున్నే లేచి వంట చెయ్" అన్నాడు. చేయను అని చెప్పాను. వాడి ఉనికినే నేను భరించలేకపోతున్నాను. నువ్వు రావచ్చుగా. నన్ను తీసుకెళ్ళచ్చుగా? ఎంత దుర్మార్గుడివి సుమా నువ్వు. నువ్వు లేని క్షణాలు నాకు యుగాలైతే నువ్వు ఎంచక్కా కుక్కగొడుగులు, పట్టుపురుగులు పెంచుకుంటూ ఆనందంగా ఉన్నావు'

అమ్మయ్యా! ఈ సుమ అమ్మాయికాదు. అబ్బాయే. ఇదేదో ట్రయాంగిల్ లవ్‌లా ఉంది అనుకుంది సజని.

'మధ్యాహ్నం అమ్మనించి ఫోన్. ఈ దరిద్రుడు అన్నం పెట్టట్లేదని కంప్లైంట్ చేసినట్లున్నాడు. ."నువ్వా సుమేష్‌ని మర్చిపోలేదా? నానాజీ మంచి కుర్రాడు. మంచి భవిష్యత్తు ఉన్నవాడు. నిన్ను ఇష్టపడ్డాడు. వెనకా ముందూ ఎవరూ లేనివాడు అతనితో సక్రమంగా ఉండు. మా పరువు తీయద్దు. ఇప్పటికే నాన్న నీ పేరు వింటేనే మండిపడుతున్నాడు." అంటూ. నాకూ ఆయన మీద పీకలదాకా కోపంగా ఉంది. సుమేష్‌ని ఎంత ప్రేమించానో తెలిసికూడా ఆ కుక్కగొడుకులవాడికి పిల్లనివ్వను అని ఈ నానాజీగాడిని వెదికి తెచ్చి, రాష్ట్రం నుంచి తరిమేశాడు. చచ్చినా ఆయన మొహం చూడను. '

తర్వాత రెండు పేజీలు ఖాళీగా ఉన్నాయి.

భాస్కర్ వచ్చే టైం అవడంతో సజని లేచి ఇంటిపనుల్లో నిమగ్నమైంది. అతను వచ్చాక ఉత్సాహంగా చెప్పింది.

"ఇవాళేం జరిగిందో తెలుసా....?"

అంతా విన్నాక భాస్కర్ చెప్పాడు.

"పాపం నానాజీ."

"మీకు అతను తెలుసా?" ఆసక్తిగా అడిగింది.

"తెలీదు సాటి మగాడు కదా పాపం. తన ప్రమేయం లేకుండానే ఈ ఉచ్చులో ఇరుక్కున్నాడు. శరీరం, మనసూ రెండూ తనవి కాని అమ్మాయిని పోషిస్తున్నాడు. తప్పంతా పినాకిని పేరెంట్స్‌దే"

"అవునండీ. ఆ సుమేష్ అయినా ఆ అమ్మాయిని రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకోవాల్సింది. మూడు జీవితాలు అల్లకల్లోలం అయ్యాయి." సజని సానుభూతిగా చెప్పింది.

"వాడు ఎన్ని పట్టుపురుగులు అమ్ముకుంటే, నెలకి మాకు వచ్చే జీతం వస్తుంది? ఆ పేరెంట్స్ ఆర్థిక లాభం ఆలోచించారు కానీ, నానాజీ జీవితం నాశనం చేస్తున్నామని ఆలోచించలేదు" భాస్కర్ నిరసనగా చెప్పాడు.

"అవునూ. మీ ఆఫీసే కదా. ఇప్పుడు వాళ్ళు ఎక్కడున్నారో తెలుసుకోవచ్చా?"

"అవసరమా? వద్దు సజని. అలాంటి బాధితుల మీద మనకి సానుభూతి ఉండాలి? ఇంట్రెస్ట్ కాదు. "

ఆమె మౌనంగా ఉండిపోయింది.

'సుమా సుమా సుమా. నాకు పిచ్చెక్కుతోంది. నానాజీ పూర్తిగా మాట్లాడటం మానేసాడు. అమ్మ ఫోన్ చేసినప్పుడల్లా తిట్లు. ఎత్తడం మానేసాను. నీ పినాకిని ఎండిపోయిన పెన్నానదిలా తయారైంది దేనిమీదా ఆసక్తి ఉండటం లేదు. ఏం తింటున్నానో, ఏం తాగుతున్నానో తెలియట్లేదు. నేను ఫోన్ చేసినప్పుడు ఏడుస్తావు, ఏడిపిస్తావు. ఏదో ఒకటి చెయ్ సుమా'

ఇంక చదవలేక డైరీ మూసేసింది సజని. వాళ్ళు చేసింది తప్పే అయినా ఆ అమ్మాయి పడే బాధ సజని మనసుని తాకింది. 'పెద్దవాళ్ళంత మూర్ఖంగా ఎందుకుంటారో' అనుకుంది.

భాస్కర్ మీద ప్రేమ, అనురాగం ఉన్న తనే ఈ వాతావరణానికి అలవాటు పడలేక బాధపడింది. మరి ఏమాత్రం ఇష్టంలేని వ్యక్తితో ఇంతదూరం వచ్చిన ఆ అమ్మాయి మనస్థితి ఎలా ఉండి ఉంటుంది? పినాకిని మీద ఆమెకి సానుభూతి కలిగింది. భాస్కర్‌కి అయిష్టం అని తెలుసు కాబట్టి ఆ డైరీ గురించి మళ్ళీ మాట్లాడలేదు కానీ దాని గురించి చాలా డిస్కస్ చేయాలని కుతూహలపడింది. కానీ ఏదో సందర్భంలో అతను ఎవరి గురించో చెప్తూ 'పక్కింట్లో ఏం జరిగిందో వీడికి కావాలి. ఎద్దు పుండుని పొడిచే కాకికి వీడికి తేడా లేదు' అనగానే మరి ఆ విషయం ఎత్తలేదు.

క్రమేపీ సజని ఆ డైరీ విషయం మర్చిపోయింది. పనిమనిషితో మాట్లాడి, షాపుల్లో మాట్లాడి మొత్తానికి హిందీ భాషని నేర్చుకుని అభివృద్ధి చేసుకుంది. లేడీస్ క్లబ్‌లో ఉత్సాహంగా పాల్గొనడం మొదలుపెట్టింది. అన్ని రాష్ట్రాల వాళ్ళు వున్న ఆ టౌన్‌షిప్‌లో, మినీ ఇండియాలో వున్న భావనతో డిబ్రూని ప్రేమించసాగింది. పుట్టింటి మీది దిగులు కూడా పూర్తిగా పోయింది. 'అస్సాం వస్తే టీ తోటలు చూపిస్తాం రండి' అని ఫోన్ చేసినప్పుడల్లా చెప్పినా ఇరువైపుల వాళ్ళు అంతదూరం రావడానికి ఆసక్తి చూపించలేదు. 'మనం ఏ లండన్‌లోనో, న్యూయార్కులోనో వుంటే అంతా వస్తామనే వారు' భర్తతో ఉక్రోషంగా చెప్పేది.

సజని క్రమంగా అస్సాంకి అలవాటు పడుతూండగా ఓ రోజు భాస్కర్ ఆఫీసు నుంచి వచ్చి చెప్పాడు.

"నాకు అగర్తల ట్రాన్స్‌ఫరైంది."

"అదెక్కడుంది?" అయోమయంగా అడిగింది.

"త్రిపురలో పక్కనే, సోమవారం జాయిన్ అవ్వాలి సామాను సర్దు" చెప్పాడు.

"అబ్బ! ఇప్పుడిప్పుడే ఇక్కడ అలవాటు పడుతుంటే, ఇంకో ఊరా?" విసుక్కుంది.

ఇంటి ప్లాన్ కొంచెం మారింది కానీ, అగర్తలలో ఇల్లు, టౌన్ షిప్ అంతా దాదాపు డిబ్రూగఢ్‌లో లానే ఉండటం ఇక్కడ సజని త్వరగానే అలవాటైంది. వాళ్ళు వెళ్ళిన రెండు నెలలకి ఓ ఆదివారం లేడీస్ క్లబ్ వార్షికోత్సవం జరిగింది. పక్కింటావిడతో సజని దానికి హాజరైంది.

"ఈవిడ పినాకిని మన క్లబ్‌లో ఏక్టివ్ మెంబర్. మహాబలేశ్వర్ నించి రెండేళ్ళ క్రితం ఇక్కడికి వచ్చారు." ఒకావిడని పరిచయం చేసింది పక్కింటావిడ.

ఆ పేరు వినగానే ఆమె వంక ఆసక్తిగా చూసింది సజని. అందంగా ఉంది. ఎత్తు, ఎత్తుకు తగ్గ లావుతో కొంచెం మొరటుగా ఉన్నా, ముఖం కళగా వుండి చూడగానే అందగత్తె అనిపిస్తుంది. ఆ పేరు అరుదు కాబట్టి ఆ పినాకినీ ఈ పినాకిని ఒక్కరే అని నమ్మింది సజని.

"ఈమె సజని. రెండు నెలల క్రితం ది్రబూగఢ్‌నించి వచ్చారు. మీ తెలుగువాళ్ళే" సుజని శంక తీరిపోయింది.

ఆమె సజని వంక చురుగ్గా చూస్తూ తెలుగులో అడిగింది.

"ది్రబూలో ఎక్కడ ఉండేవాళ్ళు? ఆఫీసర్స్ క్వార్టర్స్‌లో నేనా?"

"అవును. మాది గుంటూరు జిల్లా. మీరు?"

ఆ ప్రశ్న విననట్లుగా పినాకిని మళ్ళీ అడిగింది.

"మీ క్వార్టర్ నంబర్?"

"హెచ్ 206" తను పాత ఇంటి ఎదురు లైన్‌లోని నంబర్ చెప్పింది అనాలోచితంగా.

"ఓ! మాది నెల్లూరు" ఆమె దీర్ఘంగా శ్వాస తీసుకుని చెప్పింది. పినాకిని అంత స్నేహపూర్వకంగా లేకపోవడంతో సజని వెళ్ళి పక్కింటి పంజాబీ ఆవిడ పక్కన కూర్చుంది.

"పినాకినిది ఒక విషాదగాథ తెలుసా?" సర్దారిణి నెమ్మదిగా చెప్పింది.

"ఏం?" తనకి తెలిసినా అడిగింది.

"పాపం చిన్న వయసులోనే భర్త పోయాడు. లవ్ మేరేజ్ అట. పేరెంట్స్ పట్టించుకోలేదు. ఒక్క కజిన్ మాత్రం వచ్చి తోడున్నాడు. భర్త ఉద్యోగం ఆమెకి ఇవ్వడంతో పాపం ఉద్యోగం చేస్తూ బతుకుతోంది. పిల్లలు కూడా లేరు."

సజని గుండె దడదడలాడింది. నానాజీ పోయాడా? ముప్పై ఏళ్ళలోపు వాడు హఠాత్తుగా ఎలా పోతాడు? లవ్ మేరేజ్ ఏమిటి? బహుశా పినాకిని పెద్దవాళ్ళ మీద కోపంతో వాళ్ళని వదిలేసి, ప్రపంచానికి వాళ్ళ గురించి చెడుగా చెప్పినట్లుంది.

"చిన్నదే కదా? ఇంకో పెళ్ళిచేసుకోవచ్చు" చెప్పింది నెమ్మదిగా.

"ఇంకో పెళ్ళి చేసుకుంటే, ఆమెకి ఈ ఉద్యోగం ఉండదు. కారుణ్య నియామకం. నాకూ సరిగ్గా తెలీదు కానీ మరణించిన భర్త వల్ల వచ్చిన ఉద్యోగం చేసేప్పుడు కొన్నేళ్ళదాకానో, ఎప్పటికీనో రెండో పెళ్ళి చేసుకోకూడదు."

"ఓ!"

కొద్దిసేపు ఆగి అనుమానంగా అడిగింది.

"కజిన్ తోడుగా ఉన్నాడన్నారు కదా? అతని పేరు మీకు తెలుసా? "

"సుమేష్. పిక్నిక్స్‌కి వెళ్ళినప్పుడు ఆమెతో వస్తాడు."

అంతకు మించి ప్రశ్నలు వేస్తే ఆవిడ విసుక్కుంటుందని సజని మౌనంగా వుండిపోయింది.

"సజనీ ఆంధ్రా అమ్మాయ్ పినాకినిని కలిసావా?" భాస్కర్ కొలీగ్ భార్య భోజనాల దగ్గర అడిగింది.

"కలిసాను" పొడిగా చెప్పింది.

"మీరూ ది్రబూగఢ్ నించి వచ్చారు కదా! పాపం అక్కడే వాళ్ళాయన పోయాడు" సానుభూతిగా చెప్పింది.

అంటే పెళ్ళయిన కొన్నాళ్ళకే నానాజీ పోయాడు పాపం అనుకుంది.

"ఎలా పోయారు?" అడిగింది.

"మష్‌రూమ్స్ కూర తిని"

"ఏమిటి?" సజని నిర్ఘాంతపోయింది.

"నీకు మష్రూమ్స్ తెలుసుకదా?"

"ఆఁ తెలుసు" తమాయించుకుని చెప్పింది.

"వాటిలో కొన్ని విషపూరితమైనవి ఉంటాయి కదా పొరపాటున విషపు మష్రూమ్స్ కూర తిన్నాడు. దాంతో తెల్లారేసరికి చచ్చిపడున్నాడు."

"మరి ఆవిడ తినలేదా?"

"ఆ రోజు శనివారం. పినాకిని శనివారం రాత్రిళ్ళు అన్నం తినదుట. ఆమె భర్త మష్రూమ్స్ తెచ్చి వండమంటే, 'రేపు ఉదయం చేస్తాను ఇద్దరం తినచ్చు' అని చెప్పిందిట కూడా. కానీ అతను లేదు ఇవాళ తినాలని ఉంది అని బలవంతంగా వండించుకున్నాట్ట. పాపం మృత్యువు అలా తరుముకు వచ్చింది.."

సజనికి ఏం జరిగి వుంటుందో స్పష్టంగా అర్థమైంది. భాస్కర్‌కి ఫోన్ చేసి చెప్పింది.

"వంట్లో బాలేదు వచ్చి నన్ను తీసుకెళ్తారా?"

అతను కంగారుగా ఐదు నిమిషాల్లో వచ్చేసాడు.

"ఏమైంది?" బైక్ ఎక్కుతున్న సజనిని అడిగాడు.

"ఇంటికి వెళ్ళాక చెప్తా. పోనీండి" చెప్పింది.

అప్పుడే అక్కడికి వచ్చి ఆగిన కార్లోంచి దిగిన వ్యక్తి ఎవరికో ఫోన్ చేసాడు.

"పినాకినీ బయట ఉన్నా వచ్చెయ్."

అతను సుమేష్ అని గ్రహించింది. పువ్వులాను లేడు. మన్మధుడిలా కూడా లేడు. సినిమాల్లో విలన్ వెనక ఉండే చింపిరి జుట్టువాడిలా ఉన్నాడు.

సజని చెప్పింది విన్న భాస్కర్ కూడా ఆశ్చర్యపోయాడు.

"ఎంత తెలివిగా హత్యచేసింది?"

"అదేకదా? ఆ డైరీ చదివి పినాకినిది ఎంత సున్నితమైన మనసు, ఎంతటి భావుకత్వం అనుకున్నాను తప్ప ఒక మనిషిని ప్రేమించినందుకు మరో మనిషి ప్రాణాలని తీస్తుందనుకోలేదు. పాపం నానాజీ" సజని బాధగా చెప్పింది.

"అది నిజమైన ప్రేమ కాదు. చాలామంది ప్రేమించాం అనే భావనని ప్రేమిస్తూంటారు. తూర్పుకి వెళ్ళే కొద్దీ పడమర దూరమైనట్లు, మనసు ప్రేమతో నిండినప్పుడు ద్వేషానికి చోటుండదు. అంత నిర్దాక్షిణ్యంగా నానాజీని హత్యచేసి, అతని చావులో కూడా ఉద్యోగం అనే లాభం పొంది, ఆ సుమేష్‌గాడి కుక్కగొడుగులు, పట్టుపురుగుల వ్యాపారాన్ని మాన్పించి తానే పోషిస్తున్నట్లుంది." భాస్కర్ ఆవేశంగా చెప్పాడు.

"మరి నానాజీ కుక్కగొడుగుల వల్ల పోతే ఇక సుమేష్ ఆ వ్యాపారం ఎలాచేస్తాడు?" సజని కూడా కోపంగా చెప్పింది.

"అక్రమ సంబంధానికి కజిన్ అనే ముసుగు కూడా ఛీఛీ." ఛీత్కరించాడు భాస్కర్.

"మన క్వార్టర్ నంబర్ అడిగితే తప్పు చెప్పా. లేకపోతే మనింటికి కూడా ఘుమ ఘుమలాడే మష్రూం క్రరీ వచ్చేదేమో" నవ్వుతూ చెప్పింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story